క్లుప్తంగా

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



పుదుకుప్పంలో కాలువల్లో నీటిని పరిశీలిస్తున్న సబ్‌యూనిట్ అధికారి

సత్యవేడు: పరిసరాల శుభ్రంతోనే ఆరోగ్యం చేకూరుతుందని ఆరోగ్యశాఖ సబ్‌యూనిట్ అధికారి మోహన్ తెలిపారు. శుక్రవారం పుదుకుప్పంలో ఎంపీటీసీ శరవణన్, సర్పంచ్ నాగమణి ఆధ్వర్యంలో దాసుకుప్పం పీహెచ్‌సీ హెల్త్ సెంటర్ సిబ్బంది పర్యవేక్షణలో గ్రామంల్లో ఫ్రైడే డ్రైడే । కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ యూనిట్ అధికారి మోహన్ మాట్లాడుతూ ప్రజలు పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తి గత శుభ్రత పాటించాల్సిన అవసరం ఉందన్నారు. మలేరియా, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. అనంతరం టైర్లు, కొబ్బరి చిప్పల్లో నిలచి ఉన్న నీటిని తొలగించి గృహస్తులకు అవగాహన కల్పించారు. మురుగు కాలువల్లో మలాథిన్ పిచికారీ చేయించారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఈఓ సుబ్రమణ్యం, సెక్రటరీ మాధవి, షణ్ముగం, మహాలక్ష్మి, ఏఎన్‌ఎం సుమలత తదితరులు పాల్గొన్నారు.

ఫ్రిడ్జ్ పెట్టారు.. నీళ్లు మరిచారు!



ఖాళీగా ఉన్న ఫ్రిడ్జ్

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): తిరుపతి అంతర్జాతీయ విమానాశ్రయంలో వేసవిలో ప్రయాణికుల బంధువులు, సందర్శకులు, వాహనచోదకుల దాహర్తి తీర్చడానికి ఫ్రిడ్జి ఏర్పాటు చేశారు. అయితే అధికారులు అందులో నీరు నింపడం మరిచిపోయారు. గురువారం ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా హుటాహుటిన విమానాశ్రయం వెలుపల తాగునీటి ఫ్రిడ్జి ఏర్పాటు చేశారు. ఫ్రిడ్జ్ పెట్టారే గాని అందులో నీళ్లు లేకపోవడం చర్చనీయాంశంగా మారింది. ఉన్నతాధికారుల ప్రశంసల కోసం సీఎం పర్యటనలో విమానాశ్రయ అధికారులు ఫ్రిడ్జ్‌ను ఏర్పాటు చేశారని, పర్యటన అనంతరం ఫ్రిడ్జ్‌ను ఖాళీగా వదిలేశారు. విమానాశ్రయ అధికారులు స్పందించి తాగునీటి సదుపాయం కల్పించాలని ప్రయాణికుల సంబంధికులు కోరుతున్నారు.

విద్యా సామగ్రి పంపిణీ



సామగ్రిని పంపిణీ చేస్తున్న జూలియన్ రాజు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం వెంకటాపురం పంచాయతీ అన్నస్వామిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 60 విద్యార్థులకు శుక్రవారం ఆషా స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జూలియన్ రాజు ఆధ్వర్యంలో విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలు సునీత గౌడ్ మాట్లాడుతూ ఆషా సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం విద్యార్థులకు విద్యా సామగ్రిని అందిస్తున్నారన్నారు. ఎప్పుడు విద్యార్థులకు అవసరమైన ఏ సహాయం అడిగిన కాదనకుండా చేస్తున్నారని తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల తరపున వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కుమారి, సుహాసిని, నాగమ్మ పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయండి



ఆక్రమణకు గురవుతున్న చెరువు

శ్రీకాళహస్తి: చెరువు వద్ద హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు అధికారులను వేడుకుంటున్నారు. తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లి వద్ద అధికార పార్టీకి చెందిన ఓ వ్యక్తి దర్జాగా చెరువుకట్ట, ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి చదును చేస్తున్నారని గ్రామస్తులు కోరుతున్నారు. ఆక్రమణలు తొలగించి, హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

డెయిరీపార్లర్‌లో చోరీ

నాగలాపురం: స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఉన్న ఆరోగ్య మిల్క్ డెయిరీపార్లర్‌లో గురువారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడి కథనం మేరకు.. షాపు యాజమాని సాంబశివం ఉదయం 6 గంటలకు షాపు తెరవడానికి వెళ్లి చూడగా తాళాలు పగిలి ఉండడంతో లోపలకు వెళ్లి పరిశీలించగా డ్రాలో ఉన్న నగదు లేకపోవడంతో వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దుకాణ యాజమాని సాంబశివం రాత్రి సుమారు రూ.85 నగదు దుకాణంలో పెట్టి వెళ్లానని, ఉదయం వచ్చి చూసే సరికి తాళాలు పగలకొట్టి నగదు చోరీ చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్ఐ సునీల్ పేర్కొన్నారు.

మాయగాళ్లకు మన్ను దన్ను

తమిళనాడు సమీపంలోని సత్యవేడు మండలం చెన్నేరి పరిసరాల్లోని భూముల్లో మట్టి అక్రమ వ్యాపారులకు నిలయంగా మారుతోంది. ఇక్కడి ఎస్టీ, ఎస్సీలకు చెందిన డీకేటీ భూములతోపాటు ప్రభుత్వ భూముల్లో ఎర్రమట్టి అక్రమార్కులకు సిరుల పంట పండిస్తోంది. తమిళనాడులో అభివృద్ధి పనులు, పారిశ్రామిక, గృహ అవసరాలకు యథేచ్ఛగా తరలిసించి రూ.కోట్లు గడిస్తున్నారు. అడ్డుకోవాల్సిన అధికారులు మౌనం దాల్చడంతో అక్రమార్కుల ఆగడాలకు అడ్డులేకుండా పోతోంది.

- చెన్నేరిలో భూముల్లో గ్రావెల్ తవ్వకాలు
- అనుమతులు ఆంధ్రాలో.. తరలింపు తమిళనాడుకు
- అధికార పార్టీ నేతల అండదండలతో రెచ్చిపోతున్న మట్టి మాఫియా
- డీకేటీ భూముల్లో స్మగ్లర్ల దందా
- టిప్పర్ రూ. 25 వేల నుంచి రూ.30 వేలకు విక్రయం



చెన్నేరి వద్ద టిప్పర్లకు ఎర్రమట్టి నింపుతున్న జేసీబీలు

సత్యవేడు: నియోజకవర్గంలో మట్టి మాఫియా రెచ్చిపోతోంది. అధికార పార్టీ నాయకులు, అధికారుల అండదండలతో చెన్నేరి నుంచి తమిళనాడుకు నిరాటంకంగా ఎర్రమట్టి అక్రమ రవాణా సాగుతోంది. పార్టీ నేతలు, అధికారుల వరకు అందరికీ మామూళ్లు అందుతుండడంతో మిన్నకుండిపోతున్నారు. అన్నీ తెలిసినా రెవెన్యూ, పోలీసు నిఘా విభాగం అధికారులు నిమ్మకు నీరెత్తిన చందంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలున్నాయి.



ఎర్రమట్టితో చెన్నైకి తరలివెళుతున్న టిప్పర్లు

అనుమతి గోరంత.. తరలింపు కొండంత..

సత్యవేడు మండలంలోని దాసుకుప్పం పంచాయతీ పరిధిలోని చెన్నేరి రెవెన్యూ లెక్కదాఖలా 82, 83 సర్వే నంబర్లలో 2.42 హెక్టార్లు డి.బాబు పేరున అనుమతి పొందారు. పర్మిషన్ కొంతే ఉన్నా కాంట్రాక్టర్లు, స్మగ్లర్లు ప్రభుత్వ భూముల్లో రాత్రి వేళ్లలో భారీ యంత్రాలతో మట్టి తవ్వి తరలిస్తున్నారు. అలాగే మదనంజేరి, తెలుగుగంగ కాలువ మట్టిని తమిళనాడుకు తరలిస్తున్న టిప్పర్లు సక్రమమైన పర్మిట్లు లేకుండా తరలిస్తున్నట్లు సమాచారం.

డీకేటీ భూములపై కన్ను

దాసుకుప్పం పంచాయతీ పరిధిలోని చెన్నేరి రెవెన్యూ లెక్క దాఖలాలో 87 సర్వే నంబర్‌లో 46 ఎకరాలు భూమిని 50 సెంట్లు వంతున లబ్ధిదారులకు ప్రభుత్వం అందజేసింది. దిగువన చెవురు ఎగువున భూములు ఉండడంతో నీటి వసతిలేక లబ్ధిదారులు సాగు చేయలేక బీడు భూమిగా వదిలేశారు. స్థానికేతరులు ఎస్సీ, ఎస్సీ భూమలు 5 ఎకరాలకు పైగా డీకేటీ భూములు కొనుగోలు చేసినట్లు సమాచారం. ఎస్సీ, ఎస్టీలకు చెందిన భూముల్లో నాణ్యమైన ఎర్రమట్టి ఉండడంతో స్థానిక నాయకులతో మంతనాలు జరిపి, ఆ భూములు కొనుకోలు చేసి, మట్టి తరలింపునకు శ్రీకారం చుట్టారు.

మట్టి తరలింపును అడ్డుకున్న లబ్ధిదారులు

చెన్నేరిలో 50 మందికి చెందిన ఎస్సీ,ఎస్టీలకు చెందిన డీకేటీ భూముల్లో రాత్రి వేళల్లో అక్రమంగా జేసీబీలతో ఎర్రమట్టి తీసి టిప్పర్లతో తమిళనాడుకు తరలిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న చెన్నేరి లబ్ధిదారులు తమకు కేటాయించిన స్థలాల్లో మట్టి తరలింపును అడ్డగించారు. దీంతో అక్రమార్కులపై విరుచుకు పడ్డారు.



బావులను తలపిస్తున్న గోతులు

తమిళనాడు అభివృద్ధి పనులకు ఆంధ్రా మట్టి

చెన్నైలో జాతీయ రహదారి పనులు, లోతట్టు ప్రాంతాలను ఎత్తు చేయడం, పట్టణ ఆధునీకరణ, రోడ్డు విస్తరణ, భారీ వంతెనల నిర్మాణం తదితర పనులకు తమిళనాడు కాంట్రాక్టర్లకు నాణ్యమైన ఎర్రమట్టి అవసరం ఉంది. అక్కడి కాంట్రాక్టర్లు తమిళనాడు ప్రభుత్వం మట్టి తీసుకునేందుకు అక్కడ అనుమతులు స్వల్పంగా ఇస్తోంది. దీంతో మట్టి అవసరం ఎక్కువగా ఉండడంతో చెన్నై కాంట్రాక్టర్లు సరిహద్దు ప్రాంతమైన సత్యవేడుపై కన్నేశారు. పనులు పొందిన కాంట్రాక్టర్లు ఆంధ్రా–తమిళనాడు సరిహద్దుల్లోని మండలాల్లో టీడీపీ పెద్దలతో సత్సంబంధాలు పెట్టుకుని ఎర్రమట్టి తమిళనాడుకు యథేచ్ఛగా తరలిస్తున్నారు. అధికారులకు మామూళ్లు ఇస్తుండడంతో వారు కూడా రైట్‌రైట్ అని చెబుతున్నారన్న విమర్శలున్నాయి.

కంకర దోపిడీ చేస్తున్నారు !



చమర్తికండ్రిగ వద్ద టిప్పర్‌ను అడ్డుకుని నిరసన తెలుపుతున్న చెంగయ్య

సత్యవేడు: మండలంలోని చమర్తిర్తికండ్రిగలోని క్వారీల నుంచి అధిక లోడ్‌తో కంకర తరలిస్తూ దోపిడీ చేస్తున్నారని టీడీపీకి చెందిన చెంగయ్య ఆరోపించారు. శుక్రవారం గ్రామం నడివీధిలో నిరసన తెలిపి, కంకర లారీలను అడ్డుకున్నారు. ప్రభుత్వం కంకర దోపిడీని అరికట్టాలని, ఈ టిప్పర్లతో పాడైన రోడ్డును మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ చమర్తి కండ్రిగలో నడుస్తున్న క్వారీల నుంచి టిప్పర్లలో అధిక లోడ్‌తో కంకర తరలిస్తుండడంతో పాండూరు– నాగలాపురం రోడ్డు గుంతమయమైందన్నారు. ద్విచక్రవాహనచోదకులు రాత్రి వేళ ప్రయాణం ప్రమాదకరంగా మారిందన్నారు. రోజు వందల సంఖ్యలో టిప్పర్లు తమిళనాడుకు కంకర తరలిస్తుండడంతో టిప్పర్లు నుంచి వస్తున్న దుమ్ము బాటసారులపై పడుతోందన్నారు. రోజు క్వారీ యజమానులు రోడ్డుపై దుమ్ములేయకుండా ట్రాక్టర్లు ద్వారా నీటిని చల్లాలని డిమాండ్ చేశారు. కంకర లారీలతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను సీఎం దృష్టికి తీసుకుపోతామన్నారు. ప్రజలు ఇబ్బందులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకే నిరసన కార్యక్రమం చేపట్టామన్నారు.

రోడ్డు ఆక్రమిస్తే చర్యలు తప్పవు



స్థానికులకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసులు

శ్రీకాళహస్తి: రోడ్డు ఆక్రమిస్తే చర్యలు తప్పవని శ్రీకాళహస్తి ఒకటో పట్టణ సీఐ గోపి హెచ్చరించారు. శుక్రవారం ఆయన బీపీఅగ్రహారం ప్రాంతాన్ని పరిశీలించారు. కొన్ని దుకాణాల యజమానులురోడ్డును ఆక్రమించి, దుకాణాలు ఏర్పాటు చేసుకున్నట్లు గుర్తించారు. వారిని తమ పరిధిలోనే వ్యాపారాలు నిర్వహించుకోవాలని సూచించారు లేని పక్షంలో చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే ఆటోడ్రైవర్లు, వాహనచోదకులు తప్పకుండా సంబంధిత పత్రాలను తమ వద్ద ఉంచుకోవాలన్నారు. లేనిపక్షంలో జరిమానాలు తప్పవని తెలిపారు.

ఆర్‌అండ్‌బీ స్థలంలో అక్రమ కట్టడాలు



ఆర్ అండ్ బి రోడ్డు స్థలంలో అక్రమ కట్టడాలు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం తూకివాకం పంచాయతీలోని ఎస్ఎస్ పురం సమీపంలోని కాటన్ మిల్ వద్ద ఉన్న రేణిగుంట–పుత్తూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు స్థలంలో శుక్రవారం అక్రమ కట్టడాలు నిర్మించడంతో ఆగ్రహించిన గ్రామస్తులు కట్టడాలను ఆపేయాలని నిలదీశారు. ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరగడంతో మహిళలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు. స్థలం సమస్య అయినందున రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేయాలని పోలీసులు తెలపడంతో మహిళలు రెవెన్యూ అధికారులకు సమాచారం అందించారు. వీఆర్వో మల్లికార్జున్ సంఘటన స్థలానికి చేరుకుని రోడ్డు స్థలంలో నిర్మిస్తున్న కట్టడాలను నిలిపివేయించారు. ప్రభుత్వ స్థలాల్లో ఎవరూ నిర్మాణాలు చేపట్టినా చర్యలు తీసుకుంటామని వీఆర్వో తెలిపారు.

వడదెబ్బపై అవగాహన ర్యాలీ



రేణిగుంటలో వడదెబ్బపై అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యాధికారులు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంటలో శుక్రవారం తిరుపతి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డిప్యూటీ డెమో కిరణ్ కుమార్ రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ జుబేర్ అహ్మద్ ఆరోగ్య సిబ్బంది వడదెబ్బపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలందరూ వేసవి కాలంలో వడదెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండలంలోని గుత్తివారిపల్లెలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వడదెబ్బపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున పిల్లలు,వృద్ధులు, గర్భిణులు, బాలింతలు, ముఖ్యంగా దీర్ఘకాలిక వ్యాధులతో బాధలు పడుతున్నవారు వడదెబ్బ తగలకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కామరాజు, సీహెచ్ఓ హైమావతి, నాగరాజు, ఏఎన్ఎం పద్మ పాల్గొన్నారు.

అన్నమయ్యకు స్వర నీరాజనం



సుకన్య రాంగోపాల్ బృందం ప్రదర్శన

తిరుపతి కల్చరల్ : సంగీత విద్యాంసురాలు సుకన్య రాంగోపాల్ వినూత్న రీతిలో ఘటాలతో అన్నమయ్యకు స్వర నీరాజనాలు సమర్పించారు. శ్రీత్యాగరాజ స్వామి కల్చరల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో త్యాగరాజ మండపంలో చేపట్టిన అన్నమయ్య సంకీర్తనోత్సవాలు శుక్రవారంతో నాలుగో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రాత్రి 7 నుంచి 9.30 గంటల వరకు సునక్య రాంగోపాల్ సంకీర్తనలాపన సాగింది. వీరికి గాత్రంతో విద్యరామ్‌నాథ్, వేణువుపై వాణి మంజునాథ్, వీణపై లత నిక్షిత్, మృదంగంపై లక్ష్మీ రాజశేఖర్ అయ్యర్, మోర్సింగ్‌పై భాగ్యలక్ష్మీ,ఎం.కృష్ణ చక్కటి సహకారం అందించారు. పతంగి బ్రదర్స్ దాత్రే పతంగి, ధ్రువ్ పతంగి ప్రదర్శించిన గాత్ర కచేరీ ఆకట్టుకుంది. వీరికి వయోలిన్‌పై అభిజిత్ నరసింహన్, మృదంగంపై అశ్విన్ శ్రీధరన్ సహకరించారు. అనంతరం కళాకారులను ట్రస్ట్ అధ్యక్ష, కార్యదర్శులు మోహన సుందరం, కంచి రఘురామ్ సత్కరించారు.

నివాళులు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాటూరు గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు మట్టే నారాయణ, తిరుమలశెట్టి చెంచులక్ష్మమ్మ శుక్రవారం ఆనారోగ్యంతో మృతి చెందారు. వీరి మృతికి వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కొనతనేని మణి నాయుడు, వైస్ ఎంపీపీ మునికృష్ణారెడ్డి, జిల్లా వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శులు గోపాల్‌రెడ్డి, ఉగ్గు మూడిగురునాథం, నాయకులు ఆశోక్, శరత్‌యాదవ్, మురళి, హరిరెడ్డి, ధనంజయులు, వెంకటేష్, కాళేష్, కిరణ్‌యాదవ్, కృష్ణయ్య తదితరులు నివాళులర్పించారు.

శ్మశానానికి దారి వసతి కల్పించండి

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కొత్తపాళెం శ్మశానానికి దారి లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. శ్మశానం గ్రామానికి రెండు కిలోమీటరు దూరంలో ఉండడంతో శవాన్ని తీసుకుపోవటానికి నానా అవస్థలు పడుతున్నారు. శ్మశానం పంట పొలాల మధ్యలో ఉండడంతో శవాన్ని పొలాల్లో మోసుకు పోలేక పోతున్నారు. శ్మశానానికి గతంలో దారి ఉండేదని, ప్రస్తుతం ఆ దారిని కొందరు ఆక్రమించుకోవడంతో ఇబ్బంది పడుతున్నామని గ్రామస్తులు అంటున్నారు.

కంచి పీఠాధిపతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు

శ్రీకాళహస్తి: కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకరాచార్య శ్రీశంకర జయేంద్ర సరస్వతి స్వామి ఆధ్వర్యంలో గంగాసదన్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయాధికారులు ఆయనకు సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. గంగాసదన్‌లో శ్రీమహాత్రిపుర సుందరి సమేత చంద్ర మౌళీశ్వరపూజ, దుర్గా సూక్తహోమం నిర్వహించారు. ఉత్తరా ఖాండ్‌లోని బద్రీనాథ్ ఆలయ ప్రధాన అర్చకులు అమర్నాథ్ నంబుద్రీ రావల్ కూడా విచ్చేశారు.

ముక్కంటిసేవలో హైకోర్టు రిజిస్టర్ విజిలెన్స్ ఎఫ్ఏసీ



ఆలయంలో శ్రీనివాస శివరామ్

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామివారిని శుక్రవారం రాష్ట్ర హైకోర్టు రిజిస్టర్ విజిలెన్స్ ఎఫ్ఏసీ శ్రీనివాస శివరామ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయాధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజయ స్వామి సన్నిధి వద్ద వేదపండితులు ఆశీర్వచనం పలికి, స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయాధికారులు తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు ప్రారంభం

సాక్షి ఎఫెక్ట్..



పద్మా నగర్‌లో కాలువ శుభ్రం పనులను పర్యవేక్షిస్తున్న ఈఓపీఆర్డీ ప్రభురావు

రేణిగుంట (శ్రీకాళహస్తి రూరల్): రేణిగుంట మండలం జీ పాళెం పంచాయతీ పద్మానగర్‌లో అధికారులు పారిశుద్ధ్య నిర్వహణ పనులు చేపట్టారు. పద్మానగర్‌లో పారిశుద్ధ్యలోపంపై సాక్షి దినపత్రికలో «స్వచ్ఛాంధ్ర కాదు.. మురుగాంధ్ర» శీర్షికన వచ్చిన కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై స్పందించిన అధికారులు శుక్రవారం జేసీబీతో కాలువలు శుభ్రం చేయించే పనులు ప్రారంభించారు. డీపీఓ సుశీలాదేవి, డీఎల్‌పీఓ ప్రభురెడ్డి ఆదేశాల మేరకు ఈఓపీఆర్డీ ప్రభురావు పద్మానగర్ లోని పరిస్థితులను పరిశీలించారు. వెంటనే కాలువలు శుభ్రం చేయించాలని ఆదేశించడంతో కార్యదర్శి వెంకటరత్నం, సర్పంచ్ బత్తెమ్మ దగ్గరుండి జేసీబీతో కాలువలో పేరుకుపోయిన వ్యర్థాలను శుభ్రం చేయించారు.

వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం తీసుకురావాలి



మాట్లాడుతున్న సుబ్బారావు

వరదయ్యపాళెం: రాష్ట్రంలో వ్యవసాయ కూలీలకు సమగ్ర చట్టం తీసుకురావాలని రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు దడాల సుబ్బారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శ్రీకాళహస్తిలోని సుందరయ్య భవన్‌లో శుక్రవారం జిల్లా కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సుబ్బారావు మాట్లాడుతూ వ్యవసాయ కూలీలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో ఏడాదికి 200 రోజులు పని కల్పించి, రోజుకు రూ.600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అలాగే వ్యవసాయ కూలీలకు సాగు భూములు పంపిణీ చేసి పట్టాలు ఇవ్వాలన్నారు. పేదలకు ప్రభుత్వం ప్రకటించిన మేరకు 3 సెంట్ల ఇంటి స్థలం కేటాయించి పక్కా ఇళ్ల మంజూరు చేయాలని కోరారు. పక్కా ఇళ్ల నిర్మాణానికి ఒక్కో ఇంటికి రూ.5 లక్షలు చెల్లించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వందవాసి నాగరాజు, మండల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

పడమటి మండలాలకు పశుగ్రాసం

శ్రీకాళహస్తి: పట్టణ పరిసర ప్రాంతాల్లో రైతుల నుంచి పలువురు పాడిపోషకకులు పశుగ్రాసం కొనుగోలు చేసి నిత్యం పడమటి మండలాలకు తరలిస్తున్నారు. శ్రీకాళహస్తి, నాయుడుపేట, సూళ్లూరుపేట ప్రాంతాల్లో వరిపంట అత్యధికంగా పండిస్తారు. ఈ నేపథ్యంలో పడమటి ప్రాంతాలైన కుప్పం, పలమనేరు ప్రాంతాల నుంచి శ్రీకాళహస్తిలో పశుగ్రాసం కొనుగోలు చేసి, పడమటి మండలాలకు తరలిస్తుంటారు. రానున్న వేసవి కాలం నేపథ్యంలో కూరగాయల పంటలు పండించే పడమటి మండలాల్లో పశుగ్రాస కొరత ఉంటుంది. అందుకోసం శ్రీకాళహస్తి, నాయుడు, సూళ్లూరుపేట ప్రాంతాల్లో పశుగ్రాసం కొనుగోలు చేసి తరలిస్తున్నారు.

పదో రోజూ రిలే నిరాహార దీక్ష

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కనమనంబేడు దళితులు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఇళ్ల పట్టాల కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్ష పదో రోజైన శుక్రవారం కూడా కొనసాగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇళ్ల పట్టాలు ఇచ్చే వరకు రిలే నిరాహార దీక్ష కొనసాగిస్తామని తెలిపారు. సీపీఐ మండల కార్యదర్శి ధర్మయ్య, గ్రామస్తులు రమణయ్య, సుబ్రమణ్యం, వీరాస్వామి, మణి, గుర్రమ్మ పాల్గొన్నారు.



రిలే నిరాహార దీక్ష చేస్తున్న దళితులు

అమ్మో.. అరుదూరు రోడ్డు

వరదయ్యపాళెం: మండలంలోని అరుదూరు రోడ్డు అధ్వానంగా మారింది. పంచాయతీరాజ్‌కు చెందిన ఈ రోడ్డు సుమారు 5 కిలోమీటర్ల మేరకు గుంతలమయంగా మారి, కంకర తేలిపోయి, రాకపోకలకు ఇబ్బందికరంగా ఉంది. వరదయ్యపాళెం నుంచి అరుదూరుకు వెళ్లే ఈ మార్గంలో అనేక మంది అటు కంచరపాళెం, ఇతరత్రా గ్రామాలకు నిత్యం ప్రయాణిస్తుంటారు. అయితే రోడ్డు పూర్తిగా పాడైపోవడంతో స్థానికులు, వాహనచోదకులు ఇబ్బంది పడుతున్నారు. 15 ఏళ్ల కిందట పంచాయతీరాజ్ శాఖ ద్వారా ఈ రోడ్డును నిర్మించారు. అప్పటి నుంచి ఇప్పటివరకు రోడ్డుకు ఎలాంటి మరమ్మతు చేపట్టకపోవడంతో రోజురోజుకు రోడ్డు పరిస్థితి అధ్వానంగా మారుతోంది.



కంకర తేలిన అరుదూరు రోడ్డు మార్గం



గుంతలమయంగా ఉన్న అరుదూరు మార్గం